4. కాలం బయ్యెను రారమ్మనుచు – [1]నీల మేఘాకృతితో వచ్చి – కాలదండము [2]జిరజిర ద్రిప్పుచు = చాల [3]భయానక – లీలన్ మృత్యువు – [4]మ్రోల న్నిలిచిన – వేళను [5]దాలిమి – దూలి చనుం గా – బోలు [6]భవత్కరు– ణాలింగన సుఖ – [7]మత్తఱి నొసఁగవె ॥పైనమై॥

5. నీ దివ్య రూపధ్యానంబు – నిర్మలాత్మాంతర సౌఖ్యంబు – నా దేవుని ప్రేమామృత సారంబు = నీ దాసుని కవి – నిరత మొసంగుచు – నా దారిని గల – సేదలు దీర్పను – నాదియు మధ్యము – నంతము లేని పు – నాదులుగల నీ – [8]సౌధము జేర్పవె ॥పైనమై॥

6. ఎండమావుల [9]కీడైనట్టి – యిహ సౌఖ్యములు త్వరగాఁబోవు నీ – నిండు దరుగని నిత్యానందంబు = దండిగ నీయం –దుండిన వారి క– ఖండామృత సౌ – ఖ్యము లిచ్చెదవట – తండ్రీ భవ దు – త్తమ దాసుల నీ – వుండిన చోటనె – యుంచుము చాలును ॥పైనమై॥

– పురుషోత్తము చౌదరి

## 487 *Whither pilgrims, are you going ?*

1. పరదేశి, పుణ్యక్షేత్ర
యాత్రఁ బోవుచుందువా?
యేసు నాజ్ఞ తల పోసి
మోక్ష మొందఁ బోదును.
కొండ లెక్కి యేళ్లు దాఁటి
మోక్ష రాజ్యమ్ చేరుదాఁక
ముందు పోవుచుందును.

2. ఒంటిగాను బోవుదువే
నీకు భయ ముండదా?
లేదు నాకు భయమేల?
స్వామి నన్ను c గాచును ;
మోక్ష రాజ్యం చేరుదాఁక
యేసు నాకుఁ దోవచూప
ముందు పోవుచుందును.

3. పరదేశి, మోక్షమందు
నీకు లాభ ముందునా?
నిత్యానంద సువిశ్రాంతి
యందు నుండు లాభము.
జీవనది నీళ్ల త్రాగి
యేసుతో సదా వసింప
ముందు పోవుచుందును

4. పరదేశి, నీతో నేను
యాత్ర చేయ వచ్చునా?
రమ్ము నాతోఁ గూడ రమ్ము
యేసు నిన్ను రమ్మనెన్
మార్గాయాసమైన నేమి
మాకు మోక్షం చిక్కు వేళ
సువిశ్రాంతి కల్గును.

అను : బర్నార్డ్ లూకాస్

---

[1]కారుమబ్బుల ఆకారముతో. [2]గిరగిరమని. [3]భయమును కలిగించునట్టి. [4]ఎదుట. [5]ఓర్పు. [6]నీ కరుణచేత నన్ను కౌగలించుకొనగా గల్గు సౌఖ్యమును. [7] ఆ సమయమునకు. [8]గృహమును. [9] సమానమైనట్టి



# క్రైస్తవ నిరీక్షణ – ఆనందము

## 488 క్రీస్తునందు ఆనందించుట

రా –బిలహరి (చాయ : విజయంబు విజయంబు) తా–అట

ఘనమైన క్రీస్తు కృపఁ – గనుగొంటి నిపుడు – ఘనుఁడు తన మహిమచేఁ – గాఁచి పెంచెను నన్ను ॥ఘనమైన॥

1. ఆపదలలో మునిఁగి – యడలుచుండఁగ నన్ను c – జేపట్టెను చింత – చే జెడకు మనుచు – వేపాకు కన్న నిది – వెగటైన నా జిహ్వ – తీపుగా నొనరించి – స్థిరపరచె నిపుడు ॥ఘనమైన॥

2. ఘనమైన యాపదల – కడలిలోఁ బడి యున్న – ఘనుఁడు నా దెసఁ జూచి – మనసు నొచ్చుకొనియె – కనికరముచే నన్నుఁ గరుణింతు నిప్పుడె – వెనుకఁ జూడక తనదు – వెంట రమ్మనెను ॥ఘనమైన॥

3. కుల గోత్రములు వీడి – కుటిలంబు దిగనాడి – వలబద్ద చేఁపవలె – వదల కని పలికెన్ – సిలువపై నసు విచ్చి – బలహీన మెదలించి – వలవలను కన్నీరు– వల పోసినాఁడు ॥ఘనమైన॥

4. పర్వతములపైఁ గట్టు – పట్టణమువలె నిన్ను – నుర్విలో నుంచితి – నుచి తంబుగాను – సర్వజనులకు వెలుఁగు –సాక్షిగా నీవుండి – గర్వింప వలదనుచు ॥ఘనమైన॥

5. సదమలం బగు జ్ఞాన – సరణి యిదె నా మాట – ముదముతో నమ్మినను – మోక్ష మొసఁగెదను – కదిసి సాతాను బలు – కాడిక్రిందను బడిన – విదలించి నరకమున – వేతునని పలికెన్ ॥ఘనమైన॥ –యేసుదాసు నర్సయ్య

## 489 మనశ్శాంతియే మహా భాగ్యము

రా –సౌరాష్ట్ర తా–అట

మనసానందముఁ బొందుట కన్నను – మరి యే భాగ్యము గల దన్న = అనుమానము లిఁక – సఖిల సుఖంబులు – దిన మొక గడికొక – తీరై యుండును ॥మన॥

1. దిటముగఁ బ్రార్థన యను ఖడ్గముఁ గని – తిరుగు పిశాచము వెఱ చన్న = పటుదీప్తులు గల – ప్రభు శాస్త్రోక్తులు – బహు సంశయ పం – కము నింకించును ॥మన॥